# సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 2 । అక్టోబర్ । 2023






## ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పలాస కోసంగిపురం కూడలి వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఒకరు చనిపోగా ఆరుగురు గాయపడ్డారు.

- 8లో



## సహిత కేంద్రాల్లో..

సహిత కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. రేపటి నుంచి సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు.

- 8లో

## ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా శ్రీరాములు



శ్రీకాకుళం: శ్రీకాకుళం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా గరిపాటి శ్రీరాములను ప్రభుత్వం నియమించింది. బట్టిప్రోలులో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఆయనను పదోన్నతిపై శ్రీకాకుళం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా నియమించారు. శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈయనను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

## న్యూస్‌రీల్

### 'గుర్తింపు కార్డులకు దరఖాస్తులు సమర్పించాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలోని వివిధ కళల బృందాల సభ్యులు గుర్తింపు కార్డులకు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కార్డులు కోరే కళాకారులు తమ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, బ్లడ్ గ్రూప్, కళారంగం, అనుభవం, ఫోన్ నంబర్, ఆధార్, ఇ -మెయిల్, కుల, ఆదాయ వివరాలతో పాటు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేసి సమర్పించాలన్నారు. వీటితో పాటు కళాకారుడిగా మండల తహసీల్దార్ ధ్రువీకరించిన పత్రాన్ని కూడా జతచేయాల్సి ఉందని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 7లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ, అఫీషియల్ కాలనీ, జేసీ గారి బంగ్లా దరి, శ్రీకాకుళం వారికి నేరుగా లేదా పోస్టు ద్వారా సమర్పించవచ్చన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

### 'వన్య ప్రాణులను కాపాడుకుందాం'



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు

ఇచ్ఛాపురం రూరల్: మూగజీవాలైన వన్యప్రాణులను కాపాడుకుందామని కాశీబుగ్గ అటవీ శాఖ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణంనాయుడు పిలుపునిచ్చారు. జాతీయ వన్య ప్రాణుల వారోత్సవాలు సందర్భంగా ఆదివారం మండలం తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో తేలుకుంచి విదేశీ పక్షులకు నిలయంగా పేరు సంపాదించిందని, ఏటా మన గ్రామానికి వస్తున్న ఈ పక్షులను కంటి పాపల్లా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఐ.రాము, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, డీఆర్‌ఓలు బి.సురేష్, దుర్గాదేవి, భానుమూర్తి, చైతన్య, జోగారావు, మేరుగు సూర్యనారాయణ, కార్యదర్శి విజయలు పాల్గొన్నారు.

### క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో గల రాష్ట్ర క్రీడా అకాడమీలో బాలురు ప్రవేశాల కోసం శాప్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సీఈఓ బీవీ ప్రసాదరావు, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడాంశాల్లో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో బాలురు 2005 సెప్టెంబర్ 30 నుంచి 2011 సెప్టెంబర్ 30 మధ్య జన్మించిన వారు హాజరు కావాలని స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. బాలురు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 3కలర్ పాస్‌ఫొటోలు, గతంలో క్రీడాపోటీల్లో పాల్గొన్న పార్టిసిపేషన్/ప్రశంసా పత్రాలతో ఎంపికలకు హాజరుకావాల్సి ఉంటుందని ప్రసాద్, శ్రీధర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు, సందేహాలకు 98660 98642 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు. కాగా ఈ ఎంపికల కోసం గత కొద్దిరోజులుగా క్రీడాకారులు సాధనలో నిమగ్నమయ్యారు.


# చెరగని గురుతులు



శ్రీకాకుళం కల్చరల్: మహాత్ముని స్మృతులు జాతి మదిలో ఇంకా కదలాడుతున్నాయి. స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలోనే ఆయన శ్రీకాకుళం జిల్లాలో కూడా పర్యటించారు. జిల్లాలో పర్యటించినపుడు వెయ్యి రూపాయిలు ఇచ్చిన వారి ఇంటికే వెళతానని ఆయన ప్రకటించారు. ఆవిధంగానే వెళ్లారు. హరిజనోద్ధరణకు విరాళాలను ఇవ్వాలని పిలుపునిచ్చారు. నేడు గాంధీ జయంతి.

- 1927 డిసెంబర్‌లో మహాత్మాగాంధీ జిల్లాకు వచ్చారు.
- జిల్లాకు వచ్చిన మహాత్మాగాంధీని శ్రీకాకుళం పురపాలక సంఘం డిసెంబరు 2న ఘనంగా సత్కరించింది.
- ఈ పౌరసన్మాన సభలో ఖద్దరు వస్త్రంపై రాసిన సన్మాన పత్రాన్ని మహాత్మాగాంధీకి అందజేశారు.
- ఆయన దాన్ని అక్కడే వేలం వేయగా, నాటి ప్రముఖ న్యాయవాది వెంట్రాప్రగడ సూర్యారావు రూ.250లకు కొనుగోలు చేశారు.
- గాంధీజీ ఆ రాత్రి ఎంబాడ హనుమంతరావు పంతులు ఇంటిలో బసచేశారు.
- తనను చూడడానికి వచ్చిన మహిళలకు హరిజనోద్ధరణకు మీ వద్ద ఉన్న ఆభరణాలు ఇవ్వాలని కోరగా మహిళలంతా ఆభరణాలు విరాళంగా ఇచ్చారు.
- గాంధీ వద్దకు వచ్చిన ఖాదీ కార్మికులు తాము నేసిన వస్త్రాన్ని బహూకరించారు. బొంతల కోడూరు సన్నఖాదీ కార్మికులు ఇచ్చిన సన్నఖాదీని చూసి మహాత్ముడు అబ్బురపడ్డారు.
- మహాత్మాగాంధీ 1927 డిసెంబరు 2, 3 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు జరిగే పర్యటనకు గాను హిరమండలానికి చెందిన అంధవరం వెంకటరెడ్డి తన కారును ఇచ్చారు.
- ఆ కారును శ్రీకాకుళానికి చెందిన మెకానిక్ అక్రం నడిపారు.
- వెంకటరెడ్డి భార్య వెంకటరమణమ్మ తన మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును గాంధీకి విరాళంగా ఇచ్చారు.

### ● మహాత్మునికి మందిరం



స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్మా గాంధీ చేసిన శాంతియుత పోరాటాలకు గుర్తుగా స్థానిక స్వదేశీ మత్స్యకారులు బాపూజీకి గుడి కట్టి పూజిస్తున్నారు. టెక్కలి కంచ్రవీధిలో 1951లో నిర్మించిన ఈ గాంధీజీ గుడిలో ప్రతి రోజు పూజలు చేయడం ఈ ప్రాంత ప్రజలకు ఆనవాయితీ. అప్పటి మత్స్యకార సొసైటీ సభ్యుడు అనంత మధుసూధన బెహరా ఆధ్వర్యంజీ ఈ వీధిలో గాంధీజీకి గుడి కట్టారు.

– టెక్కలి

# సామాన్యుడిపై అబీమానం

- వైఎస్సార్ బీమాతో భరోసా
- వారంలోనే క్లెయిమ్ నగదు చెల్లింపులు
- 4 నుంచి పది రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ



శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ బీమా సామాన్యుడి పాలిట వరంలా మారింది. బీమా కట్టిన వారు దురదృష్టవశాత్తు మరణిస్తే రావాల్సిన పరిహారాన్ని వారం రోజుల్లోనే చెల్లింపులు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ క్లెయిముల చెల్లింపుల్లో ఆధునిక విధానాన్ని తీసుకువచ్చింది. ఈ పద్ధతితో బీమా కంపెనీల జాప్యానికి చెక్ పెట్టింది. బీమా కలిగిన వ్యక్తి మరణిస్తే, 4 నుంచి 10 రోజుల్లోగా వారికి రావాల్సిన బీమా మొత్తాన్ని లబ్దిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఒకప్పుడు బీమా చెల్లింపులు ఆయా బీమా కంపెనీల పరిధిలో ఉండేవి. దీంతో వారు నెలల తరబడి చెల్లింపులు చేసేవారు కాదు. అడ్డగోలు అంక్షలు పెట్టి, కొర్రీలతో కాలయాపన చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించింది. బీమా మొత్తం చెల్లింపుల విషయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులకు అధికారాలు అప్పగించింది. దీంతో దరఖాస్తు కార్యాలయానికి చేరిన వెంటనే ఆ మొత్తాన్ని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నెల నుంచి క్లెయిములు తక్కువ రోజుల్లో విడుదల కావడంతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతోంది.

**బీమా ఉద్దేశం**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక బీమాను సులభతరం చేశారు. కుటుంబ పెద్ద మరణిస్తే, ఆ కుటుంబం ఇబ్బందుల పాలు కాకూడదని వైఎస్సార్ బీమా పేరిట ఈ పథకాన్ని తీసుకువచ్చారు. కుటుంబ ప్రధాన ఆదాయ పరుడు మృతి చెందితే వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఈ బీమా ఎంతో ఉపయోడపతుంది.

**బీమా ఇలా**

వయోపరిమితి ఆధారంగా బీమా చెల్లింపులు ఉంటాయి. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఆ కుటుంబ ప్రధాన ఆదాయ పరుడై ఉండి, సాధారణ మరణం చెందితే రూ.లక్ష అందజేస్తారు. అదే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే ప్రమాదవశాత్తు 18-70 ఏళ్ల మధ్య ఉన్నవారు మృతి చెందితే వారికి రూ.5 లక్షలు పరిహారం ఇస్తారు. ప్రమాదవశాత్తు ఆ వ్యక్తి వికలాంగుడైతే వారికి రూ.2.5 లక్షలు నుంచి రూ.5 లక్షలు వరకు పరిహారం చెల్లిస్తారు.

**జిల్లాలో ఇలా..**

ఏటా బీమా క్లెయిమ్‌లను జూలై ఒకటి నుంచి జూన్ 30వ తేదీ వరకు లెక్కిస్తారు.

| | |
|---|---|
| **(2021-2022లో)** | |
| మొత్తం క్లెయిములు | 1433 |
| సాధారణ మరణాలు | 1228 |
| ప్రమాద మరణాలు | 204 |
| వైకల్యం చెందిన వారు | 1 |
| చెల్లించిన మొత్తం | రూ.12.92 కోట్లు |
| **(2022-23లో)** | |
| మొత్తం క్లెయిములు | 1456 |
| సాధారణ మరణాలు | 233 |
| ప్రమాద మరణాలు | 219 |
| వైకల్యం చెందిన వారు | 4 |
| చెల్లించిన మొత్తం | రూ.14.37 కోట్లు |
| **(2023లో ఇప్పటి వరకు )** | |
| మొత్తం క్లెయిములు | 363 |
| సాధారణ మరణాలు | 322 |
| ప్రమాద మరణాలు | 39 |
| వైకల్యం చెందిన వారు | 2 |
| చెల్లించిన మొత్తం | రూ.0.97 కోట్లు |

**వారం రోజుల్లోనే..**

గతంలో బీమా క్లెయిముల చెల్లింపులు ఆలస్యమయ్యేవి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం క్లెయిముల చెల్లింపుల బాధ్యతలు డీఆర్‌డీఏకు అప్పగించింది. అర్హులైన వారి నుంచి క్లెయిము వచ్చిన వెంటనే వాటిని పరిశీలించి, వారం రోజుల్లోగానే బాధిత కుటుంబాల వారి బ్యాంకు ఖాతాలో బీమా మొత్తాన్ని చెల్లిస్తాం. దీంతో తక్షణం సాయం అందించే అవకాశం కలిగింది.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం.

# తొలి రోజు నిరాశే..



కిరణ దర్శనానికి బారులు తీరిన భక్తులు

- ఆకాశంలో మబ్బులతో ఆదిత్యుని కిరణ స్పర్శ దర్శనానికి ఆటంకం
- నేడు కిరణాలు తాకే అవకాశం

అరసవల్లి: అద్భుత దర్శనానికి మబ్బులు అడ్డంకయ్యాయి. ఆ అద్భుత క్షణాల కోసం వేచి చూసిన వందలాది కళ్లకు నిరాశే ఎదురైంది. తొలి సూర్యోదయ కిరణాలు నేరుగా సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టును స్పృశించే దృశ్యం కోసం ఆదివారం వేకువజామున 4 గంటల నుంచి అరసవల్లిలో భక్తులు బారులు తీరారు. అయితే ఆకాశమంతా మబ్బులమయం కావడంతో తొలి సూర్యకిరణాలు గర్భాలయానికి చేరుకోలేదు. ఉదయం సరిగ్గా 6.29 నిమిషాలకు నేరుగా రాజగోపురానికి పైదిశగా కిరణ కాంతులు చేరడంతో తొలిరోజైన ఆదివారం కిరణ స్పర్శ దర్శనానికి వీలుకాలేదు. కిరణ స్పర్శ ఘడియలతో పాటు ఆదివారం కూడా కావడంతో క్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం కూడా కిరణాలు పడే అవకాశం ఉందని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. స్వామిని విజయవాడ నగర మేయర్, జిల్లా వాసి రాయన భాగ్యలక్ష్మి దర్శించుకున్నారు. అలాగే ఎస్పీ రాధిక కూడా కుటుంబసమేతంగా హాజరయ్యారు. అయితే కిరణాల దర్శనం కాకపోవడంతో కొంత నిరాశను వ్యక్తం చేసినప్పటికీ, వారికి ఆలయ ఈఓ, ప్రధానార్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి, అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మైలపల్లి లక్ష్మి, లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ రాధికకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో



సోంపేట: ఉప్పలాం వద్ద పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



జలుమూరు: చీపురు పట్టి వీధులు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో కలెక్టర్, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, బాలలు

# స్వచ్ఛతే మనందరి నినాదం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత మన నినాదం కావాలని, స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల ప్రాంగణంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా.. స్వచ్ఛతా శ్రమదాన్ పేరిట ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్‌లు, లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు, వాకర్స్‌క్లబ్‌లు, ఎన్‌సీసీ క్యాడెట్స్, పలు కళాశాల విద్యార్థులు హాజరై కాలేజీ మైదానంలో ఉన్న చెత్తను సేకరించి పరిశుభ్రం చేశారు. అంతకుముందు కలెక్టర్ కార్యక్రమంలో భాగస్వాములైన అందరితో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతా హీ సేవా బ్యానర్‌పై కలెక్టర్ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా పరిశుభ్రతతో మహాత్ముని నివాళులర్పించాలన్నారు. శ్రీకాకుళం నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేషు మాట్లాడుతు ప్రతిరోజు ఒక గంట సమయం పరిసరాల పరిశుభ్రతకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, క్షేత్ర ప్రచార అధికారి తారక్‌ప్రసాద్, డిఐపిఆర్‌ఓ చెన్నకేశవరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రాజకీయ తరగతులు

పలాస: పలాసలో ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్న మహిళల రాజకీయ తరగతులను విజయవంతం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ కోరారు. పలాసలోని సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ కార్యాలయంలో ఆదివారం ఆమెతో పలువురు మహిళా సంఘం నాయకులు రాజకీయ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలే ఇందుకు తాజా ఉదాహరణ అన్నారు. వీటిని ఎదుర్కొనేలా మహిళలను సంసిద్ధం చేయడానికి ఈ రాజకీయ తరగతులు ఉపయోగపడాలని ఆమె ఆకాంక్షించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన రోల్‌బాల్ ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు 14 ఏళ్ల విభాగంలో దోహాన్ సాయి, దోహిత్ సాయి, కౌశిక్, తులసీరాం , 17 ఏళ్ల విభాగంలో గౌతమ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు జైమారావు, పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి జి.యశ్వంత్ హేమర్ త్రోలో తృతీయ స్థానం సాధించాడు.

# ● రంచన్‌గా పింఛన్

జిల్లాలో తొలిరోజు పింఛన్ల పంపిణీ జోరుగా జరిగింది. మొత్తం 3,23,173 పింఛన్లకు గాను ఒకటో తేదీన 2,49,972 మందికి అంటే 77.35 శాతం మందికి పింఛన్లు అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



శ్రీకాకుళం నగరంలోని లెప్రసీ కాలనీలో ఈశ్వరమ్మకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శాంతి

## క్లుప్తంగా

### క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు



జిల్లా బాస్కెట్‌బాల్ జట్లతో అర్జున్‌రావురెడ్డి, రాజు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా జట్లు ఆటతీరుతో అదరగొడుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు వేదికగా జరుగుతున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2023లో జిల్లా జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. తమ ప్రత్యర్థి జట్లపై జయభేరి మోగించిన జిల్లా పురుషులు, మహిళల రెండు జట్లు క్వార్టర్స్‌కు చేరడంపై జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, కోచ్ జి.అర్జున్ రావురెడ్డి, సీనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

### గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: మేఘవరం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో ఆదివారం ఉదయం టెక్కలి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గత కొద్ది రోజులుగా గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారు జరుగుతుందనే అనుమానంతో ఎస్పీ రాధిక, టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు నాలుగు మండలాల ఎస్ఐలతో పాటుగా సుమారు 40 మంది సిబ్బందితో మేఘవరం పంచాయతీ పరిధిలోని భీంపురం, సరియాపల్లి గిరిజన గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సోదాలు చేశారు. అదేవిధంగా గ్రామాల్లో ఉన్న వాహన రికార్డులు పరిశీలించారు. అక్కడి ఇళ్ల వెనుక ఉన్న పెరటల్లోను, గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో సైతం నాటుసారా తయారు చేస్తున్నారనే అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి నాటుసారా తయారు ఆనవాలు సైతం కనిపించలేదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.


### రోడ్డు ప్రమాదంలో సీనియర్ క్రికెట్ ప్లేయర్ మృతి



కాకర్ల శ్రీను (ఫైల్)

టెక్కలి రూరల్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలికి చెందిన సీనియర్ క్రికెట్ ప్లేయర్ కాకర్ల శ్రీను ఆదివారం మృతి చెందారు. శ్రీను స్థానికంగా ఎందరో యువకులను క్రికెటర్లుగా తీర్చిదిద్దారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో శంషాబాద్ సమీపంలో రోడ్డు పక్కగా నడుచుకుని వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడే ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్నారు. శ్రీను మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

### 'వృద్ధుల సంక్షేమానికి కృషి'



వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వృద్ధుల సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తామని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత అన్నారు. శ్రీకాకుళం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ దగ్గర గల సీవీ నాగజ్యోతి ఆనంద నిలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, మల్లేశ్వరరావులు మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు ఏ సమయంలోనైనా ఏ రకమైన ఇబ్బంది కలిగినా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా తక్షణమే సహాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్‌కు సహకారం అందిస్తున్న 15 మందిని సత్కరించారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹140 | ₹235 | ₹ 255 |

# సహిత కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీ

- తుది దశకు సహిత విద్యా రిసోర్స్ పర్సన్ల నియామక ప్రక్రియ
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 17 పోస్టుల కోసం 172 మంది దరఖాస్తులు
- రేపటి నుంచి 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన



సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్యా రిసోర్స్ పర్సన్ల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సమగ్రశిక్ష పరిధిలోని సహిత విద్యా (భవిత) కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెలువరించిన విషయం తెలిసిందే. ఇందుకోసం శ్రీకాకుళం అర్బన్‌తో కలిపి జిల్లాలో 39 మండలాల పరిధిలో 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకుగాను సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ కార్యాలయం నేరుగా దరఖాస్తులను ఆహ్వానించింది. డిగ్రీతోపాటు డీఎడ్/బీఎడ్/ఎంఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ తదితర అర్హతలను కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

### సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూలు



దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 3 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ ఆఫీసర్ సంతకాలతో కూడిన రెండు సెట్ల కాపీలు, ఒరిజినల్ ఆన్‌లైన్ అప్లికేషన్ తమ వెంట విధిగా తీసుకురావాలి. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కలెక్టర్, జేసీ నేతృత్వంలో ఇంటర్వ్యూలు చేపడతాం. మరిన్ని వివరాలకు, సందేహాలకు 94924 20186 నంబర్‌ను సంప్రదించవచ్చు.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ శ్రీకాకుళం జిల్లా

**జిల్లా నుంచి 172 మంది దరఖాస్తులు..**

జిల్లాలో మొత్తం 17 సహిత విద్యా రిసోర్స్‌పర్సన్స్ పోస్టులకుగాను మొత్తం 172 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5ఎంఆర్ పోస్టులకు 103 మంది దరఖాస్తులు చేసుకోగా.. 12 వీఐ/హెచ్ఐ పోస్టులకుగాను 69 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి మెరిట్ లిస్టు తీసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయాలని తొలుత భావించిన అధికారులు.. తర్వాత దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరి సర్టిఫికెట్లను పరిశీలించాలని నిర్ణయించారు.

**రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన..**

ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో పరిశీలించనున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపాడు రోడ్‌లో రామలక్ష్మణ ఎస్‌బీఐ బ్రాంచ్ వెనుక ఇందిరానగర్‌కాలనీలో సమగ్రశిక్ష కార్యాలయంలో 3వ తేదీన వీఐ/హెచ్ఐ కేటగిరీ వారికి, 4వ తేదీన ఎంఆర్ కేటగిరీ వారికి సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 5న రిజర్వ్ డేగా కేటాయించారు. ఇందుకోసం కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, సీనియర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో కూడిన కమిటీలను నియమిస్తున్నారు.




సహిత విద్యా (భవిత) కేంద్రం

**వెంట తీసుకురావాల్సిన పత్రాలు**

టెన్త్‌క్లాస్, ఇంటర్మీడియెట్, డిగ్రీ టీడీ/ప్రొవిజినల్ సర్టిఫికెట్లు, మార్క్స్‌షీట్‌లు, ప్రొఫెషినల్ క్వాలిఫికేషన్స్ (డీఈడీ/బీఈడీ/ఎంఈడీ విత్ స్పెషల్ ఎడ్యుకేషన్), ఆర్‌సీఐ సర్టిఫికెట్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, క్యాస్ట్ సర్టిఫికెట్, డిజైరబుల్ సర్టిఫికెట్ (దరఖాస్తు చేస్తే), తాజా ఇంకమ్ సర్టిఫికెట్(వెనుకబడిన తరగతుల వారు) సర్టిఫికెట్లను విధిగా తీసుకురావాల్సి ఉంటుందని సంబంధిత సమగ్రశిక్ష జిల్లా అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# జిల్లా అండర్–23 క్రికెట్ జట్లు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అండర్–23 త్రీడేస్ మ్యాచ్‌ల క్రికెట్ టోర్నీకి జిల్లా జట్టు ఖరారైంది. మద్దెల సూర్యకిరణ్ సారథ్యంలో 16 మందితో సభ్యులతో కూడిన తుది జట్టుతోపాటు మరో ఐదుగురు ఆటగాళ్లను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టు జాబితాను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎన్ శాస్త్రి, హసన్‌రాజ షేక్ వెల్లడించారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని హిందూస్థాన్ జింక్ గ్రౌండ్ గాజువాక వేదికగా ఈనెల 3వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. సోమవారం సాయంత్రం జిల్లా జట్టు ఇక్కడ నుంచి పయనమై విశాఖలోని క్రీడామైదానం వద్ద రిపోర్ట్ చేయనుంది.

**శ్రీకాకుళం మ్యాచ్‌ల షెడ్యూల్ ఇది..**

ఈనెల 13వ తేదీ వరకు జరగనున్న ఈ టోర్నీలో భాగంగా శ్రీకాకుళం జట్టు తన మొదటి మ్యాచ్ (3,4,5 తేదీల్లో) విజయనగరంతో పోటీపడనుంది. తన రెండో మ్యాచ్(7,8,9 తేదీల్లో) తూర్పుగోదావరి జట్టుతో, ఆఖరి, మూడో మ్యాచ్ (11,12,13 తేదీల్లో) విశాఖపట్నంతో తలపడనుంది.

జిల్లా జట్టుకు జీపీ నాయుడు మేనేజర్‌గా, ఎంఎస్ దీపక్‌కుమార్ సెలెక్టర్‌గా వ్యవహరించనున్నారు. జిల్లా జట్టుకు అవసరమైన క్రీడాదుస్తులు, కిట్‌లను మాజీ క్రికెటర్ ఇలియాస్ మహ్మద్ సమకూర్చుతున్నారు.

**జిల్లా జట్టు వివరాలు**

మద్దెల సూర్యకిరణ్ (కెప్టెన్), ఎస్.హిమకర్, డి.కులశేఖర్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ (వికెట్ కీపర్), ఎస్.సుకాంత్, పి.సిద్ధువిఘ్నేష్, హర్షిత్ కార్తికేయ, వై.జ్ఞానతేజ, థామస్ (వికెట్ కీపర్), ఎం.పూర్ణచంద్ర, ఎం.రోహిత్, వి.ప్రద్నేష్ సాయి, పి.సతీష్, కె.గణేష్, ఎం.సాయియశ్వంత్, అప్పన్న రెడ్డి. స్టాండ్‌బైగా జి.లవన్, టి.విజయ్, డీపీఎస్ శ్రీరాం, జి.లిఖిత్, బి.జగదీష్ ఎంపికైనవారిలో ఉన్నారు.

# 'ప్రభుత్వం చొరవ చూపాలి'



మాట్లాడుతున్న థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

సంతబొమ్మాళి: థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ విన్నవిస్తున్న వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వడ్డితాండ్ర కూడలిలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ దీక్ష శిబిరం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కమిటీ నాయకులు, ప్రజలపై పెట్టిన కేసులు ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు. కాకరాపల్లి థర్మల్ ప్లాంట్‌కు సంబంధించి 1108 జీఓ రద్దు చేయాలని, తంపర భూములను మత్స్యకారులకు చేపలవేటకు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, స్పీకర్ తమ్మినేని సీతారాంలు కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి మండల గన్ను, మండపాక నరసింహారావు, కమిటీ నాయకులు కోత మధుసూధనరావు, ఎస్.వెంకటరావు, అనంత, హన్నారావు, కత్రో కారుణ్య కేశవ, ఆనందు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా: వ్యక్తి దుర్మరణం



ఆదినారాయణ మృతదేహం

హిరమండలం: ఆటో బోల్తా పడిన ఘటనలో మండలంలోని సుభలయ గ్రామానికి చెందిన యర్రా ఆదినారాయణ (58) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఆదినారాయణ చేపల వ్యాపారం చేస్తుంటారు. నిత్యం కాశీనగర్‌లో చేపలు కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి విక్రయిస్తుంటారు. శనివారం చేపలు కొనుగోలు చేసుకొని ఆటోపై వస్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత కొండరాగోలు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆదినారాయణ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఆటో డ్రైవర్ రాంబాబు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించినట్టు చెప్పారు.

# ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహం



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహం

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషిచేస్తానని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహం అన్నారు. శ్రీకాకుళంలోని హోటల్ విజేత ఇన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్టణం నుంచి వారణాసి వెళ్లేందుకు సరైన సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాన అంశంగా ఈ విషయాన్ని ప్రస్తావించి విశాఖపట్టణం నుంచి వారణాసికి నేరుగా ప్రత్యేక రైలును వేయించామని తెలిపారు. ఈ రైలు ఈనెల 15 లేదా 22వ తేదీన ప్రారంభిస్తారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో సుదీర్ఘ చరిత్ర కలిగిన రాజకీయ నాయకులు ఉండి కూడా రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం మంజూరు చేసిన కేంద్రసంస్థలు ఒక్కటి కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. జిల్లా వెనుకబాటుకు రాజకీయ నిర్లక్ష్యమే కారణమని దుయ్యబట్టారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారని, ఇది చాలా దుర్మార్గమన్నారు. ఉత్తరాంధ్ర నుంచి వలసవెళ్లిన కేసీఆర్ తొలగించిన ఆయా బీసీ కులాలను వెంటనే బీసీ జాబితాలో చేర్పించాలన్నారు. విశాఖపట్టణంను గ్రోత్ హబ్‌గా చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్‌పై స్పందిస్తూ స్టీల్ ప్లాంట్ పెట్టుబడుల ఉపసంహరణను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఈ స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పట్టేవిధంగా యాజమాన్యం, ఉద్యోగులు, ప్రభుత్వంపై ఉందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలరావు, బిర్లంగి రామ్మోహనరావు, అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు ఉన్నారు.

# ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు



రమేష్ రాతో(ఫైల్)

కాశీబుగ్గ, ఇచ్ఛాపురం రూరల్, టెక్కలి: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ జాతీయ రహదారి కోసంగిపురం ఫ్లై ఓవర్ వంతెన వద్ద ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి మందస వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఎదురుగా వస్తున్న ఆటోపై దూసుకుపోవడంతో ఆటోలో ఉన్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు ఆస్పత్రిలో మృతి చెందారు.

ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి ఆటోలో ఏడుగురు వ్యక్తులు పలాస వెళ్తుండగా కోసంగిపురం దగ్గర ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో బత్తుల జయ, బత్తుల ఎర్రయ్య, మడ్డు దేవయ్య, బత్తుల పార్వతి, రమేష్, మాధవరావులతో పాటు వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటకు చెందిన గీత రాంబాబులకు గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి హాహాకారాలు చేస్తున్న క్షతగాత్రులను స్థానికులు పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని కొందరు క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఏడుగురిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా వారికి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో డొంకూరు మత్స్యకార గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గృహ సారథి, ఆటో డ్రైవర్ రమేష్ రాతో (28) మృతి చెందగా మాధవరావు అనే మరో క్షతగాత్రుడిని టెక్కలి నుంచి శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఈ ఘటనపై కాశీబుగ్గ సీఐ జి.శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



ఆటోలో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు లాగుతున్న స్థానికులు, పోలీసులు



నుజ్జయిన ఆటో ఇదే

**శోకసంద్రంలో రమేష్ కుటుంబం**

పలాసలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డొంకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ గృహ సారథి రమేష్ రాతో మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. మృతుడికి భార్య రాతో లెబోజ, కుమారుడు రాతో సూయల్(8 నెలలు) ఉన్నారు. అతను ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రమేష్ మృతిపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ మోహనాంగి, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి తమ సంతాపాన్ని తెలిపారు.

# ఫార్మేటివ్–2 పరీక్షలకు సన్నద్ధం



తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థులు

- రేపటి నుంచి పాత విధానంలో పరీక్షల నిర్వహణ
- 3,051 పాఠశాలల్లో పరీక్షలు రాయనున్న 2,92,831 మంది విద్యార్థులు
- 10వ తేదీలోగా మూల్యాంకనం, ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో మార్కుల నమోదు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. ఫార్మేటివ్–2 పరీక్షలు మంగళవారం నుంచి మొదలుకానున్నాయి. 3వ తేదీన ప్రారంభమయ్యే పరీక్షలను 6వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు రాయనున్నారు. ఇందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు, డీసీఈబీ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 3,051 పాఠశాలల్లో 2,92,831 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 2,653 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2,00,847 మంది విద్యార్థులు చదువుతుండగా, 398 ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 91,984 మంది చదువుతున్నారు. వీరంతా ఈ ఫార్మేటివ్–2 పరీక్షలు రాయనున్నారు.

**ఉమ్మడి ప్రశ్న పత్రంతో పరీక్షలు..**

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రం ద్వారానే పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్–1 పరీక్షను క్లాస్ రూమ్ బేస్డ్ విధానం(సీబీఏ)లో ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా, ఫార్మేటివ్ –2 పరీక్షలు మాత్రం పాత విధానంలో నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రాన్ని బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాయగా, విద్యార్థులు నమోదు చేసుకుని, సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్ఏ–2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్లను సరఫరా చేయడం లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను మెయిల్/వాట్సాప్ గ్రూపులో పంపిస్తారు. ఆ పేపర్లను సంబంధిత ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మార్కులను నమోదుచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారి తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తెలిపేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది.



స్లిప్‌టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

**పరీక్షల షెడ్యూల్ ఇది..**

- 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 3, 4 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహిస్తారు. వీరికి 3న తెలుగు, గణితం, 4న ఈవీఎస్, ఇంగ్లిష్ పరీక్షలు నిర్వహిస్తారు. 5వ తేదీన 3,4,5 తరగతుల విద్యార్థులకు ఓఎస్ఎస్సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు.
- 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్సీ–1, ఓఎస్ఎస్సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు.
- 9, 10 తరగతులకు 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషల్, ఇంగ్లిష్, 6న ఓఎస్ఎస్సీ–1, ఓఎస్ఎస్సీ–2 పరీక్షలు నిర్వహిస్తారు.

### ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి



ఫార్మేటివ్–2 పరీక్షలకు డీసీఈబీ నేతృత్వంలో అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ–మెయిల్/వాట్సాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఫార్మటివ్–2 పరీక్షలకు మాత్రమే ఈ విధంగా నిర్వహించేలా ఎస్‌సీఈఆర్టీ ఆదేశించింది. మిగిలిన అన్ని పరీక్షలకు ఇలా ఉండదు.

– గెద్దాపు రాజేంద్రప్రసాద్, డీసీఈబీ సెక్రటరీ శ్రీకాకుళం

### పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం



ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించిన మాదిరిగానే ఫార్మేటివ్–2 పరీక్షలను కూడా ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి. పరీక్షలను పక్కాగా, పారదర్శకంగా సక్రమంగా నిర్వహించాలి. పాఠశాలల హెచ్‌ఎంలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలి. ఈ ఫార్మేటివ్–2 పరీక్షలను మాత్రం పాత విధానంలోనే నిర్వహిస్తున్నాం. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే సమాచారం అందించాం. అవగాహన కల్పించాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

## • 45 ఏళ్ల తర్వాత..



కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజిలో 1978–83 మధ్య చదివిన వారు ఆదివారం ఉన్నత పాఠశాలలో మళ్లీ కలుసుకున్నారు. 45 ఏళ్ల నాటి సంగతులన్నీ గుర్తు తెచ్చుకుని సందడిగా గడిపారు. – కొత్తూరు

### రూ.లక్షలు పలికిన వినాయక లడ్డూలు

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ కంబిరి గ్రామంలో జరిగిన వినాయక లడ్డూ వేలంపాటలో లడ్డూ రూ.1.25 లక్షలు పలికింది. బొత్స మధు అనే వ్యక్తి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు డెంకివీధికి చెందిన శిష్టు శ్రీనివాసరావు, పైల కృష్ణలు అక్కడి వేలం పాటలో లడ్డూను రూ.లక్షా ఇరవై వేలకు దక్కించుకున్నారు. పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ మోదుగులపుట్టి గ్రామంలో ఉంగ కల్యాణ్ రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు.